క్లుప్తంగా

శ్రమదానంతో రోడ్డు మరమ్మతు



అయిజ: నేషనల్ యూత్ డే సందర్భంగా మండలంలోని సింధనూరు గ్రామానికి చెందిన యువకులు ఆదివారం శ్రమదానం చేసి రోడ్డుపై ఏర్పడిన గుంతలను మట్టితో పూడ్చారు. గ్రామ యువకులు సంఘటితమై 'సింధనూరు యూత్'గా ఏర్పడి సేవా కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా సింధనూరు, తొత్తినోనిదొడ్డి గ్రామాల మధ్య శిథిలమైన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. కార్యక్రమంలో సురేష్, భీమేష్, వెంకటేష్, విజయ్, రామాంజనేయులు, తిరుమలేష్, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు గోదాదేవి కల్యాణం

గద్వాల: గద్వాల పట్టణంలోని శ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో సోమవారం గోదాదేవికల్యాణం ఉంటుందని ఆలయ పూజారి బోరవెల్లి పవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులందరూ ఉదయం 10గంటలకు విచ్చేసి స్వామివారి కల్యాణం తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఎల్‌ఓసీ అందజేత

గద్వాల: అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం రిలీఫ్‌ఫండు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో మల్దకల్ మండలం నాగర్‌దొడ్డి గ్రామానికి చెందిన రాధమ్మకు మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.1.50లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గడ్డం కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మురళి, కృష్ణారెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్త రాజోళిలో తాగునీటి కష్టాలు



రాజోళి: కొత్త రాజోళిలో తాగునీటి కష్టాలు వేధిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. గణేష్ నగర్ కాలనీలో కొళాయిల ద్వారా వచ్చే నీటితో కనీసం 5 బిందెలు కూడా నిండటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం సమయంలోనే నీటిని వదలాలని,అవి కూడా కనీసం వాడుకునేందుకు సరిపడేంత స్థాయిలో వదిలితే బాగుంటుందని, సాయంత్రం సమయంలో అందరూ పనులకు వెళ్లిన సమయంలో వదిలితే నీరు పట్టుకోవడం కష్టమవుతుందని పేర్కొన్నారు.

వైభవంగా శివాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు



ఇటిక్యాల: మండలంలోని వావిలాల శివాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు దేవాలయ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గణపతి పూజ, యాగశాల ప్రవేశం, ఆవాహిత పరిహార దేవత సహిత ప్రధాన దేవత కలశస్థాపన, ధ్వజారోహణం, అంకురారోపణం, దీక్షహోమం వంటి వివిధ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, గ్రామప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

సంక్రాంతి సందర్భంగా వాలీబాల్ క్రీడలు

అయిజ: సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఆదివారం మండలంలోని సంకాపురంలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు రాములు, క్రీడాకారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గద్వాల క్రైం: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. గోనుపాడు గ్రామానికి చెందిన కర్రెప్ప, మద్దిలేటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఆదివారం సాయంత్రం ఇసుకను గోనుపాడు నుంచి గద్వాలకు ట్రాక్టర్‌తో తరలిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని సుంకులమ్మ మెట్ సమీపంలో పోలీసులు తనిఖీ చేసి అనుమతి పత్రాలు చూయించాలని కోరారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



గద్వాలలో వివేకానందుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మల్దకల్‌లో స్వామి వివేకానందుడికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు



కేటీదొడ్డిలో స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

వివేకానందుని స్ఫూర్తితో ఎదగాలి

- ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు
- విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలతో ఘన నివాళి



గద్వాలలో వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: యుక్త వయస్సులోనే భారతదేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు స్వామి వివేకానందుడని, ఆయన స్ఫూర్తితో యువకులు ముందుకు సాగాలని వివిధ పార్టీల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఆదివారం గద్వాల పట్టణంలోని రాజీవ్ మార్గ్ రోడ్డులో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- బీజేపీ, వీహెచ్‌పీ, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు.
- ఏబీవీపీ, ఎస్టీటీ, తపస్ సంఘం నాయకులు వేరువేరుగా వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- గట్టు బస్టాండ్‌లో వీహెచ్‌పీ నాయకులు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు.
- కేటీదొడ్డి మండల కేంద్రంలో, బీజేపీ కార్యాలయం వద్ద వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- శాంతినగర్, వడ్డేపల్లి మున్సిపాలిటీలో బీజేపీ నాయకులు వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- మల్దకల్, పాల్వాయి, అమరవాయి గ్రామాల్లో బీజేపీ నాయకులు వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఉండవెల్లి, పుల్లూరులో ఆదర్శ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో స్వామి వివవేకనంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాలర్పించారు.
- అయిజ మండల కేంద్రంలో విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఎర్రవల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.
- ఇటిక్యాల, సాతర్ల గ్రామంలో వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.
- రాజోళి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించి రక్తదాన శిబిరం నిర్వహించారు.



పుల్లూరులో..



సంకాపురంలో..



ఉండవెల్లిలో..



శాంతినగర్‌లో..




గట్టులో..



అయిజలో..

కనులపండువగా రథోత్సవం





స్వామి వారి రథాన్ని లాగుతున్న భక్తులు,గజవాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

ఇటిక్యాల: మండలంలోని పెద్దదిన్నె వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అర్చక కుటుంబానికి ఆర్థిక సాయం

గట్టు: మండలంలోని చాగదోణ జయరామస్వామి కుటుంబ సభ్యులను ఆదివారం జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడు ఆచార్య చక్రవర్తి పరామర్శించారు. ఆంజనేయస్వామి ఆలయ అర్చకులుగా ఉన్న మాదవయ్యస్వామి, రామాంజనేయులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా దూపదీపనైవేద్య అర్చక సంఘం అధ్యక్షుడు ఆచార్య చక్రవర్తి చాగదోణ గ్రామానికి చేరుకుని ఇద్దరు కుమారులను కోల్పోయిన జయరామస్వామిని ఓదార్చి, రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు తాహేర్, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు అశోక చక్రవర్తి, గట్టు మండల ప్రధాన కార్యదర్శి పరమేశ్వరయ్య, టీచర్ కృష్ణ, వినోద్‌కుమార్, ఎండీ రెహమాన్ ఉన్నారు.

'లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకల'కు శిక్షణ

ధరూరు: ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే 'లక్ష డప్పులు– వెయ్యి గొంతుకలు' కార్యక్రమాన్ని విజయవతం చేయాలని డప్పు కళాకారుల జిల్లా అధ్యక్షులు చరణ్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మండలం లోని అల్వాలపాడు గ్రామ శివారులో కొత్త కళాకారులకు డప్పు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ డప్పు కళాకారుడు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు డ్యాం వెంకటన్న మాదిగ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సుందరగిరి ఉత్సవాలు



ఉత్సవ విగ్రహాలను గుట్టపైకి తీసుకెళ్తున్న భక్తులు

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాల శివారులో గల సుందరగిరి గుట్టపై వెలిసిన పరమేశ్వర స్వామిడి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని అర్చకులు పరమేష్, విజయ్, సంపత్ తెలిపారు. ప్రతి ఏడాది పుష్య మాసంలో పౌర్ణమికి దగ్గరగా ఉండే సోమవారం స్వామివారి ఉత్సవాలు నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. జాతర సందర్భంగా ఆదివారం రాత్రి స్వామివారి ఉత్సవ విగ్రహాలను సుందరగిరి గుట్టపైకి పల్లకీ సేవలతో తీసుకొస్తారు. సోమవారం ఉదయం ఏ కాదశ రుద్రాభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు, మహా నైవేద్యం సమర్పిస్తారు. సాయంత్రం ఆలయంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించడంతో పాటు రాత్రి 9గంటలకు స్వామివారికి నందికోళ్ల సేవ, మంగళవారం తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం అనంతరం జాతర ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఆడ పిల్లలను చదివిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న గాజుల కృష్ణారెడ్డి

కేటీదొడ్డి: నడిగడ్డ ప్రాంతంలో చాలా మంది ఆడ పిల్లల చదువును మధ్యలోనే ఆపేస్తున్నారని, వారి చదువుకు ఆటంకం లేకుండా చూద్దామని గాజుల కృష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొండాపురంలో ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిశోర బాలికల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బాలికలను చదువులో ముందుకు తీసుకెళ్లేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కుల, మతాలకతీతంగా ప్రతి ఒక్కరు బాలికల చదువు పట్ల శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో కిశోర బాలికలు, ఎంవీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదాసి కుర్వ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

గద్వాలటౌన్: మాదాసి కుర్వ, మాదారి కుర్వ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయరాములు ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక నల్లకుంటలోని వాల్మీకి భవనంలో నిర్వహించిన సమావేశంలో 2025 సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదాసి కుర్వ సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని, డిమాండ్ల సాధన కోసం ఉద్యమించాలన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుల్లూరు వెంకటేష్, ఉపాధ్యక్షులుగా తిక్కయ్య, మధు, నాగేంద్రన్న, లక్ష్మీనారాయణ, మధు, ప్రధాన కార్యదర్శిగా రవిప్రకాష్, కోశాధికారిగా బాల కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొయిలదిన్నె తిక్కయ్యలను ఎన్నుకున్నారు.

క్రీడాకారులు క్రీడల్లో రాణించాలి



అమరవాయిలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దగోపాల్‌రెడ్డి

మల్దకల్: ప్రతి క్రీడాకారుడు తాము ఎంచుకున్న క్రీడల్లో రాణించి మంచిపేరు, ప్రతిష్టలు తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దగోపాల్‌రెడ్డి, తూం కృష్ణారెడ్డిలు క్రీడాకారులకు సూచించారు. ఆదివారం మండలంలోని అమరవాయిలో సంక్రాంతి పండగ సందర్భంగా క్రికెట్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు అరవింద్, నవీన్, అశోక్, వెంకట్రాములు, రంగన్న, మహేష్, రాజ్‌కుమార్, జమ్మన్న, రఘు తదితరులు పాల్గొన్నారు.

చీని తోటను ధ్వంసం చేసిన దుండగులు



రాయాపురంలో శివారులోని చీని తోట

గట్టు: మండలంలోని రాయాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పూసల రంగస్వామి చీనితోటకు గుర్తు తెలియని వ్యక్తులు నష్టం కల్గించారు. కాపుకొచ్చిన చీనితోటలోని కాయలను తెంపి పొలంలోనే పారబోశారు. ఆదివారం ఉదయం రైతు చెట్లకు నీరు పారించేందుకు వెళ్లగా దీన్ని చూశారు. 30 చెట్లకు సంబంధించిన కాయలను తెంపి పారబోసినట్లు రైతు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై గట్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతు రంగస్వామి తెలిపారు.

ప్రియాంకా గాంధీ జన్మదిన వేడుకలు



మానవపాడులో ప్రియాంకా గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మానవపాడు: మండల కేంద్రంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ నాయకులు శేఖర్, పురుషోత్తం ఆధ్వర్యంలో ప్రియాంకా గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షులకు సన్మానం



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ: భారతీయ జనతాపార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఇటీవల ఎంపికైన అయిజ పట్టణ, మండలాలకు సంబంధించి అధ్యక్షులను ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి, గోపాల కృష్ణలను శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో భీమసేనరావు, నరసింహయ్య శెట్టి, లక్ష్మణ్ గౌడ్, కృష్ణ, రఘు, రాము తదితరులు పాల్గొన్నారు.

వామ్మో చలి!



ధరూరులో చలి మంట కాచుకుంటున్న వృద్ధులు, చిన్నారులు

ధరూరు: మండలంలో చలి తీవ్రత పెరిగింది. వారం రోజుల క్రితం వరకు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో చలి కొంత వరకు తక్కువగానే ఉన్నా, రెండు మూడు రోజులుగా దంచికొడుతోంది. ఉదయం 9గంటలు దాటినా చలి తగ్గడం లేదు. 8గంటల వరకు పొగ మంచు రోడ్లను కప్పేసి ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గద్వాల – రాయచూరు మార్గంలో ప్రయాణించే వారు మరింత ఇబ్బందికి గురవుతున్నారు. సాయంత్రం 5 గంటల నుంచే చలి ప్రారంభమవుతుండంతో వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. బైపాస్ రోడ్డు, బస్టాండు ప్రాంతాల్లో రాత్రి 9గంటలు దాటినా జనంతో కళకళలాడేది. ప్రస్తుతం రాత్రి 7 గంటలు దాటితే రోడ్లన్నీ నిర్మానుషంగా కనిపిస్తున్నాయి.

బీచుపల్లిని సందర్శించిన మాజీ ఎంపీ రావుల



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే రావుల

ఎర్రవల్లి: మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని ఆదివారం మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అభయాంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ ప్రధాన అర్చకులు వారికి పూర్ణకుభంతో స్వాగతం పలికారు.అనంతరం ఎర్రవల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకుడు పల్లె నిర్మలా రాజు నివాసంలో ఏర్పాటు చేసిన తేనేటి విందుకు ఆయన హాజరు కాగా, స్థానిక నాయకులు ఆయనకు పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట నాయకులు అశోక్, రాజశేఖర్, సితార వెంకటేశ్వర్లు, ఎల్లారెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, తిరుమలేష్, అమరేందర్, సందీప్‌రెడ్డి, యాదయ్య, బాలయ్య, పరిపూర్ణ, వీరన్న, తదితరులు ఉన్నారు.

ఈ మలుపులు ప్రమాదాలకు పిలుపులు



మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు ఏర్పాటు చేసిన బీటీ రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రోడ్ల మలుపుల వద్ద నిర్మాణ సమయంలో అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మల్దకల్ – మద్దెలబండ, అమరవాయి – బిజ్వారం, పెద్దొడ్డి – మల్దకల్, కుర్తిరావులచెర్వు– మల్దకల్ గ్రామాల మధ్య ఉన్న రోడ్లపై మలుపులు వద్ద సూచి క బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు అవుతున్నాయి. ఈ విషయమై పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాహనదారులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ఉన్న మలుపుల వద్ద సూచిక బో ర్డులు ఏర్పాటు చేయా లని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.